



పోస్టింగుల్లో.. పైరవీలు!

కామారెడ్డి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పోలీసుశాఖలో బదిలీల ప్రక్రియను కొనసాగిస్తుంది. ఇందులో భాగంగా జోన్-1,2 పరిధి లోని పలువురు ఎస్‌ఐలు, సీఐలను భారీగానే బదిలీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో పలువురు పోలీసు అధికారులు తమకు అనుకులమైన పోస్టింగ్‌ల కోసం జోరుగా పైరవీలు చేస్తున్నారనే చర్చ పోలీసుశాఖలో జరుగుతోంది. ఇటివల కామారెడ్డి పరిధిలో ఆరుగురు సీఐలతో పాటు పలువురు ఎస్‌ఐలను బదిలీ చేయడంతో పాటు ఇతర జిల్లాలనుంచి కామారెడ్డికి స్థాన చలనం కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల మేరకు జరుగుతున్న బదిలీలు అని చెబుతున్న లోపాయి కారంగా వేరేకారణాలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులకు అనుకులంగా ఉన్న వారిని బదిలీ చేస్తున్నారని చర్చసాగుతోంది. ఇదేక్రమంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తమకు అనుకులమైన పోలీసు అధికారులను తమ ప్రాంతానికి బదిలీ చేయించుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు సీఐలు, ఎస్‌ఐలు తమకు అనుకులమైన పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తు పైరవీలు కొనసాగిస్తున్నారు.

జిల్లాలో 23 పీఎస్‌లు.. 9 సర్కిల్ కార్యాలయాలు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు సబ్ డివిజన్‌లు ఉన్నాయి. ఈ డివిజన్‌ల పరిధిలో 9 సీఐ సర్కిల్ కార్యాలయాలతో పాటు 23 పీఎస్‌లు ఉన్నాయి. ఇందులో సుమారు 9 మంది సీఐలు, 23 మంది ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు.అయితే వీరిలోంచి పలువురు సీఐలు, ఎస్‌ఐలు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై జిల్లాకు వచ్చిన వారు ఉండగా కొందరు అంతకముందు నుంచే విధులు కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ చేపడుతుంది. రెండ్రోజుల క్రితం జిల్లాలోని నలుగురు సీఐలను బదిలీ చేయగా ఇతర జిల్లాల నుంచి మరో నలుగురు సీఐలను జిల్లాకు స్థాన చలనం కల్పించారు. అంతకముందు ఓ సీఐకి కామారెడ్డి డివిజన్ పరిధిలోని కీలక పోస్టును అప్పగించారు. జిల్లాలో త్వరలోనే భారీగా ఎస్‌ఐల బదిలీలు సైతం చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

డీఎస్పీలకు స్థానచలనం తప్పదా?

జిల్లాలోని ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి,బాన్సువాడ డీఎస్పీలను సైతం బదిలీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ప్రస్తుతం డీఎస్పీలుగా కొనసాగుతున్నవారు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చసాగుతోంది. ఇదేక్రమంలో ఈ పోస్టింగ్‌ల కోసం పెద్ద ఎత్తున పలువురు డీఎస్పీ స్థాయి అధికారులు పోటీ పడుతున్నారు. కామారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లకు తీవ్ర పోటీ నెలకొంటుంది. కామారెడ్డిలో గత నాలుగేళ్ల కిందట సీఐగా పని చేసిన ఓ అధికారి ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు. సదరు అధికారి కామారెడ్డి డీఎస్పీ పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతలతో లాబీయింగ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌ల సర్కిల్ కార్యాలయాల పోస్టింగ్‌లకు చాలానే డిమాండ్ ఉంది. భిక్కనూర్, సదాశివనగర్, కామారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, మద్నూర్ నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, పిట్లం, గాంధారి తదితర పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ పొందేందుకు చాలా మంది ఎస్‌ఐలు ఆసక్తి చూపుతుంటారు. ఈ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ కోసం పలువురు పోలీసు అధికారులు పైరవీలు చేస్తున్నారని సమాచారం.

పోస్టింగ్‌ల కోసం పోటాపోటీ

గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని సాదా సీదా పోస్టింగ్‌లు, లూప్‌లైన్ ఉద్యోగాలతో నెట్టుకొచ్చామని పలువురు అధికార కాంగ్రెస్ నేతల దృష్టికి తీసుకెళ్తున్నారు. తమకు మంచి పోస్టింగ్ లు ఇప్పిస్తే అనుకూలంగా ఉంటామని హామీలు ఇస్తున్న ట్లు తెలుస్తోంది. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పోస్టుల కోసం కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేల చుట్టు ప్రదక్షిణలు చేస్తుండగా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి జుక్కల్ ప్రాంతాల్లో ఆయా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ముఖ్య నేతలను కలుస్తున్నారు. డీఎస్పీలను నియమించాలంటే డీజీపీకి, సీఐలకు పోస్టింగ్‌లు ఇవ్వాలంటే ఐజీకి, ఎస్‌ఐలను బదిలీ చేయాలంటే ఎస్పీకి చెప్పాల్సి ఉండడంతో కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు కూడా తర్జనభర్జన పడుతున్నారు. జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేలతో ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నేతలతో సంబంధాలు ఉన్న ఇతర మంత్రుల ద్వారా పోస్టింగ్‌ల కోసం నిమగ్నమయ్యారు.

పోలీసుల చిట్టాపై ఆరా

పోస్టింగ్‌లపై ఆరోపణలు తలెత్తకుండా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తుగా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తుంది. అవినీతి అక్రమాల ఆరోపణలు ఉన్నవారిని మినహాయించి ఇతర డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు చర్చ సాగుతోంది. అధికార పార్టీ నేతల సూచనలతో పాటు ఇంటలిజెన్స్, ఎస్‌బీ విభాగాల నివేదిక ఆధారంగా జిల్లాలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారనే సమాచారం. ఇప్పటికే పోస్టింగ్‌ల కోసం పోలీసు శాఖలోని ఉన్నతాధికారులకు పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు కలుస్తున్నట్లు తెలిసింది. అయితే అధికారుల సర్వీసు రికార్డు, ఇతర విషయాల ఆధారంగానే బదిలీల ప్రక్రియ ఉంటుందని సమాచారం. రెండ్రోజుల క్రితం జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేయగా ఇతర జిల్లా నుంచి మరో ఇద్దరు సీఐలు బదిలీపై వచ్చారు. అంతకుముందే నిఘా విభాగంలో ఉండే ఓ సీఐ కామారెడ్డి డివిజన్‌లోని కీలక పోలీసుస్టేషన్‌లో బదిలీపై వచ్చి బాధ్యతలను చేపట్టారు. అదేవిధంగా మరో ముగ్గురు ఎస్‌ఐలకు సైతం స్థాన చలనం కల్పించారు.

- జిల్లాలో పలువురు సీఐ, ఎస్‌ఐలకు స్థాన చలనం
- డిమాండ్ ఉన్న పీఎస్ సర్కిల్ పోస్టింగ్‌లకు ప్రయత్నాలు
- కీలక పోస్టింగ్‌ల కోసం నేతలతో లాబీయింగ్
- అధికార పార్టీ నేతల చుట్టు ప్రదక్షిణలు
- బదిలీల్లో రాజకీయ ప్రమేయం ఉన్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ
- అనుకున్న పోస్టింగ్ కోసం ఖర్చు చేసేందుకు వెనకాడని వైనం

జిల్లాలో నలుగురు ఎస్‌ఐల బదిలీ

- బదిలీపై ఇతర జిల్లాల నుంచి రానున్న ముగ్గురు ఎస్‌ఐలు

ఎల్లారెడ్డి: పోలీసుశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. ఇటీవల జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేయగా ఆదివారం మరో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి. మల్టిజోన్-3 పరిధిలోని కామారెడ్డి నుంచి నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేయగా సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్ జిల్లాల నుంచి ఒక్కో ఎస్‌ఐని కామారెడ్డికి స్థాన చలనం కల్పించారు. తాడ్వాయి ఎస్‌ఐగా పనిచేస్తున్న బీ. అంజనేయులును గాంధారి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. మెదక్ జిల్లా శంకరంపేట-ఏ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న బాలరాజును తాడ్వాయి ఎస్‌ఐగా బదిలీ చేశారు. సిద్దిపేటపోలీసుకమీషనరేట్ పరిధిలోని దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డిని లింగంపేట ఎస్‌ఐగా ,రాజన్నసిరిసిల్ల జిల్లాలోని డీఎస్‌బీ ఎస్‌ఐగా ఉన్న మహేష్‌ను ఎల్లారెడ్డి ఎస్‌ఐగా బదిలీ చేస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ప్రస్తుతం గాంధారి, లింగంపేట, ఎల్లారెడ్డి ఎస్‌లుగా పనిచేస్తున్నవారికి ఎక్కడ కూడా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వీరిని స్థానిక పోలీసు అధికారికి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

యాసంగిలో సాగర్ కింద సిరుల పంట


నిజాంసాగర్ ప్రాజెక్టు


సాగర్ కింద పూర్తయిన వరి నాట్లు

- లక్షా 35 వేల ఎకరాలకు సాగునీరు
- వరి సాగుపైనే మక్కువ

నిజాంసాగర్, జనవరి 28: ఉభయ జిల్లాల వర ప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఈ ఏడాది యాసంగిలో సిరుల పంటలు పండనున్నాయి. ప్రాజెక్టులో యాసంగికి పుష్కలంగా నీటి నిల్వలున్నాయి. ఉభయ జిల్లాల రైతాంగానికి లక్షా 35వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ ప్రణాళిక రూపొందించారు. యాసంగిలో ఆయకట్టు కింద ముందస్తుగా వరి నాట్లు వేశారు. ఆయకట్టు కింద సిరులు పండించేందుకు నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 1405 అడుగులకు గాను 1400.50 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం సాగర్‌లో 11.984 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇప్పటికే నీటి పారుదల శాఖాధికారులు 5 టీఎంసీల నీటిని విడతల వారీగా విడుదల చేశారు. క్రమేపీ నీటి నిల్వలు తరిగి పోతున్నాయి. ప్రాజెక్టును నమ్ముకున్న నాన్ కమాండ్, కమాండ్ ఏరియా రైతులు లీకేజీలపై ఆశలు పెట్టుకున్నారు. నీటి పారుదల శాఖ అధికార యంత్రాంగం ప్రాజెక్టు నుంచి లీకవుతున్న నీటిని అరికడితే రైతులకు సాగునీరు అంతంత మాత్రంగానే లభిస్తోంది. ఆయకట్టు కింద ఈ ఏడాది లక్షా 35వేల ఎకరాల్లో వరి పైరును సాగు చేసేందుకు ఖరారు చేసిన విషయం విధితమే. ఈ పంటలు గట్టెక్కాలంటే సాగర్ నుంచి మరో 4 విడతలుగా నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క విడత 3.5 నుంచి 4 టీఎంసీల వరకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే 5 విడతలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. మరో 4 విడతలు విడుదల చేస్తే ఆయకట్టు పంటలు చేతికి దక్కుతాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు నుంచి ఒప్పందం ప్రకారం 8 టీఎంసీల నీటిని ఈ ఏడాది యాసంగికి విడుదల అయ్యేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రభుత్వం విడుదల చేసేనా ప్రశ్నార్థకమే. ఉభయ జిల్లాల రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని సాగర్ కింద వేసిన పంటలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



టీచర్లే.. బోధనేతరులు!

- రికార్డు అసిస్టెంట్లుగా మారిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత వారిపైనే
- తొలిమెట్టు, ఉన్నతి, ఎఫ్‌ఆర్‌ఎస్‌ఏలతో ఇబ్బందులు
- మధ్యాహ్న భోజనం, పరీక్షలు, హాజరు నమోదు నివేదికలతో సతమతం
- విద్యాబోధనకు దొరకని సమయం

కామారెడ్డి టౌన్, జనవరి 28: పాఠశాలల్లో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు రికార్డు అసిస్టెంట్లుగా మారుతున్నారు. చదువు చెప్పడం కన్న బోధనేతర పనులకే అంకితమవుతు న్నారు. మధ్యాహ్న భోజనం లెక్కల దగ్గరి నుంచి విద్యార్థి సామర్థ్యం దాకా పలు రికార్డులు రాయడంతో పాటు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను మోస్తున్నారు. సమయమంతా ఇలాంటి పనులకే పోతోంది. విద్యార్థులకు చదువు చెప్పేందుకే సమయం దొరకని పరిస్థితి నెలకొంటుందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు బోధనేతర పోస్టుల భర్తీపై దృష్టి సారించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

తలకు మించిన భారంగా బాధ్యతలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీసీఈ విధానం, తొలిమెట్టు, ఉన్నతి, ఫేషియల్ రికగ్నేజేషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్‌ఎస్‌ఏ), మన ఊరు - మన బడి లాంటి కార్యక్రమాలు వారికి తలకు మించిన భారంగా మారుతున్నాయి. దీనికితోడు మూడేళ్ల క్రితం స్కావెంజర్లు, స్వీపర్లను తొలగించడంతో పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వ బడుల్లో రికార్డుల నమోదుకు రికార్డు అసిస్టెంట్‌లు అంతంత మాత్రంగానే ఉండడంతో ఆ బాధ్యతను ఉపాధ్యాయులు మోయాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం లెక్కలు, పరీక్షల మార్కులు, విద్యార్థుల హాజరు, సామర్థ్యాలు ఇలా అనేక అంశాలపై ఎప్పటికప్పుడు నివేదిక తయా రు చేయాలి. వాటిని ప్రతీనెలా ఉన్నతాధికారులకు పంపించాలి. ఇలా ప్రతీ స్కూల్లో సుమారు 20 వరకు రికార్డు రాయాల్సి ఉంటు ంది. అలాగే తమ క్లాసులోని విద్యార్థులకు సంబంధించిన, సబ్జెక్టుల వారీగా కూడా వివరాలు నమోదు చేయాలి.

రెండు, మూడు పీరియడ్‌లు వాటికే..

పాఠశాలలో ప్రతీరోజు 8 పీరియడ్‌లు ఉంటుండగా కనీసం 2, 3 పీరియడ్‌ల సమయం రికార్డుల నమోదుకే పోతోంది. మిగిలిన వాటిలో రెండు లేదా మూడు కంప్యూటర్ క్లాసులకు, కల్చరల్, ఇతర క్లాసులకు పోతాయి. దీంతో విద్యార్థులకు పాఠాలు ఎప్పుడు చెప్పేదని ఉపాధ్యాయులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇవి చాలవన్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య, స్వచ్ఛత వంటి కార్యక్రమాలకు ర్యాలీలు తీయడంతో పాటు దగ్గరుండి వాటిని పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సమావేశాలకు, శిక్షణ తరగతులకు టీచర్లు హాజరు కావాల్సి ఉంటుందని, ఇలా బోధనేతర కార్యక్రమాలు ఎక్కువ కావడంతో విద్యార్థులకు నష్టం జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డీఈవోల పదోన్నతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న సీనియర్ హెచ్‌ఎంలకే అదనపు బాధ్యతలుగా ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. దీంతో బాధ్యతలను నిర్వర్తించలేక వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

మహా శివరాత్రికి చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన


దోమకొండ గడికోటలో కూచిపూడి నృత్య శిక్షణ ఇస్తున్న దృశ్యం

దోమకొండ, జనవరి 28: మండల కేంద్రంలోని గడి కోటలో మహా శివరాత్రి రోజున కోటలోని శివాలయం ఆవరణలో దోమకొండ, గొట్టిముక్కుల, సంగమేశ్వర్ గ్రామాలకు చెందిన చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కోట మేనేజర్ బాబ్జి, శిక్షకురాలు హిమబిందు తెలిపారు. అందుకు ఆదివారం చిన్నారులకు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. గత 6 నెలల నుంచి ప్రతీ ఆదివారం శిక్షణ ఇచ్చామన్నారు. గత నెలలో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో దోమకొండకు చెందిన చిన్నారులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్న వారు కలిసి ప్రముఖుల ముందు నృత్య ప్రదర్శన ఇచ్చారన్నారు. మహా శివరాత్రి రోజున దోమకొండ కోటలో జరిగే కార్యక్రమానికి సినీ హీరో రాంచరణ్, ఉపాసన, కోట వారసులు కామినేని శోభన, అనిల్ కుమార్, పలువురు ప్రముఖులు, సినీ హీరోలు హాజరవుతారని బాబ్జి తెలిపారు.

'సాగర్ కాలువల్లోని పూడికను తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం'

కోటగిరి, జనవరి 28: నిజాంసాగర్ సాగునీటి కాలువల్లో పూడిక చేరి పరిస్థితి అధ్వానంగా ఉందని, పూడిక తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో నిజాంసాగర్ కాలువలను ఆదివారం ఆయన పరిశీలించారు. డీ27, డీ27/1/2 కాలువలను పరిశీలించారు. కొత్తపల్లి, హంగర్గ ఫారం, హెగ్డోలి గ్రామాలలో సాగునీటి కాలువలు పూడిక నిండిపోయి సాగునీరు అందలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రైతులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, కృష్ణారెడ్డి, భీమా సాయిరెడ్డి, హన్మంతు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో సాగునీటి కాలువను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్వప్న ఎంపిక


గురుకుల విద్యార్థిని స్వప్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి,జనవరి 28: జాతీయ స్థాయి అండర్-19 స్కూల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం(బి)గురుకుల విద్యార్థిని స్వప్న ఎంపికైందని ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం తెలిపారు. గత నెల సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో స్వప్న మంచిప్రతిభ కనబర్చిందని ఈ నెల 29నుంచి వచ్చే నెల 1వరకు మహారాష్ట్రలోని ఔరంగబాద్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్వప్న పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా స్వప్నను ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌజ్ టీచర్ చెన్నకేశ్వరి, లు అభినందించారు.

31న స్మారక జిల్లా స్థాయి చెస్ పోటీలు


సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం

పెద్దబజార్, జనవరి 28: వేములపల్లి కిరణ్‌కుమార్ 31వ స్మారక జిల్లాసాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం తెలిపారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31న జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలు పోటీలలో పాల్గొనవచ్చని అన్నారు. ఎంట్రీ ఫీజు రూ.100లు చెల్లించాలని, గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో గ్రామీణ క్రీడల రక్షణ కోసం పీవైఎల్ ఉద్యమిస్తుందన్నారు. క్రీడాపోటీలు అనంతరం ఈనెల 31న సాయంత్రం 5గంటలకు వర్ధంతి సభ నిర్వహిస్తామని అన్నారు. పూర్తి వివరాల కోసం 9059776869, 9618936156 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు రమేష్, భాస్కర్, రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి


కోటగిరిలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ కన్వీనర్ సాయిలు

కోటగిరి,జనవరి28: గ్రామాలలోని పల్లె ప్రకృతి వనాల్లో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కన్వీనర్ సాయిలు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం క్యాంపులను మండల కేంద్రాల్లోనే పెట్టి దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికేట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సాయిలు, కొండబాయి తదితరులు పాల్గొన్నారు.

సోలాపూర్‌లో పిరమిడ్ ధ్యాన మందిర సందర్శన


సోలాపూర్‌లో ధ్యానమందిరాన్ని సందర్శిస్తున్న మంగి రాములు

ఆర్మూర్‌రూరల్, జనవరి28: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం నందిపేట కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వ్యాపార నిమిత్తం సోలాపూర్‌కు వలస వెళ్లి అక్కడ ధ్యాన మందిర నిర్మించడం హర్షనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలను ధ్యానులుగా, శాఖాహారాలుగా తీర్చిదిద్దారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, బీఎస్ఎస్ఎన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవ్, నర్సయ్య, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కుద్వాన్‌పూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బొమ్మ సందీప్


నూతన కమిటీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందిపేట, జనవరి28: మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న రేణుక మాత ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బొమ్మ సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ దేవస్థానం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షులుగా బొమ్మ సందీప్, కోశాధికారిగా మంగ్లరపు తుక్కన్న, వైస్‌చైర్మన్‌గా చర్లన్న, రైటర్‌గా మెట్టు గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆర్మూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలోగ్రామస్థులు, నాయకులు, తది తరులు ఉన్నారు.

ఈ నీటి ట్యాంక్ శుభ్రం చేసేదెలా?

డొంకేశ్వర్, జనవరి28: డొం కేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో పాఠశాల సమీపం లో మంచినీటి ట్యాంకును ఏ ర్పాటు చేశారు.ట్యాంకు మెట్లు శిథిలా వస్థకు చేరాయి. ట్యాం కును శుభ్రం చేసే సమయం లో మెట్లపైకి ఎక్కితే ఎప్పు డు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నా రు. దీంతో నెలలు తరబడి నీటిట్యాంకు శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. ట్యాంకు ఎక్కిచేయడానికి వీలు లేకుండా ఉంది. ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి.వాటినితొలగించకపోవడంతో చుట్టు అపరిశుభ్రంగా మారిం ది. ట్యాంకు లో ఉన్న నీటిని కుళాయి ద్వారా గ్రామంలోకి ప్రతీ ఇంటికి సరఫరా జరుగుతాయి.ఈనీటిని నిత్యవసరాల కోసం ప్రజలు వినియోగిస్తారు.ఉన్నతాధికారుల చొరవతీసుకొని మరమ్మతులు చేయాలని స్థానికప్రజలు కోరుతు న్నారు.


ప్రమాదకరంగా ఉన్న నీటి ట్యాంకు మెట్లు

ఐరాడ్ సాంకేతిక విధానంతో రోడ్డు ప్రమాదాల నివారణ

● తగ్గుతున్న మరణాల శాతం ● సాంకేతికతో ప్రమాదాల గుర్తింపు ● 80శాతం రోడ్డు యెక్క నియమ నిబంధనలు పాటించక పోవడం వల్లనే ప్రమాదాలు


అవగాహన సదస్సులో పాల్గొన్న పోలీసులు (ఫైల్)


రోడ్డుపై సూచికలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఖిల్లా,జనవరి 28: అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు దూరం అవుతున్న వాటిని తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ రోడ్ ఆక్సిడెంట్ డేటాబేస్ (ఐరాడ్) సాంకేతిక విధ విధానం ద్వారా గుర్తించి నివారిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ ఆధ్వర్యంలో 2021లో ప్రారంభం అయిన ఈ ప్రాజెక్టు మన జిల్లా విజయవంతంగా జరుగుతూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఈఅప్లికేషన్ రాక ముందు రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సమాచారం, అది ఎలా జరిగింది,మానవ తప్పిదమా,రోడ్డు వల్లనా, వాహనం వల్లనా దాని యెక్క ప్రమాద తీవ్రత ఎంత అనే కేవలం వారి వారి శాఖల ఆధ్వర్యంలోనే ఉండేవి. కాని కేంద్ర ప్రభుత్వ శాఖ అయినా నేషన్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ తీసుకొచ్చిన ఈ అప్లికేషన్ వల్ల మొత్తం సమాచారం ఒకే దగ్గరే లభించడం సాధ్యమవుతోంది. ప్రస్తుతం ఈ అప్లికేషన్‌లో దాదాపు 10ప్రభుత్వ శాఖలు ప్రమాదాల సమాచారాన్ని పొందు పరుస్తున్నాయి. గత సంవత్సర కాలంగా జిల్లాలో విజయవంతంగా దాదాపు 750పై చిలుకు రోడ్డు ప్రమాదాల వివరాలను దీనిలో పొందుపరిచారు. పొందుపర్చడమే కాకుండా ఈ అప్లికేషన్ వాళ్ల ప్రమాదాలకు గల కారణాలను కూడా మనకి వివరిస్తోంది. వీటిని ఆధారంగా చేసుకుని పోలీసుశాఖ జాతీయ రహదారుల సిబ్బందితో పాటు వివిధ శాఖల వారు ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఈ అప్లికేషన్‌ను వివిధ శాఖల వారు ఉపయోగిస్తున్నారు. ఈ సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 300ల మంది మరణించారు. 40శాతం కన్న ఎక్కువ ద్విచక్ర వాహనాల ద్వారా జరిగాయి. వాటిలో 80శాతం రోడ్డు యెక్క నియమ నిబంధనలు పాటించక పోవడం వల్లనే జరిగాయి. ఈ సంవత్సరం డిచ్‌పల్లి, ఆర్మూర్ పరిధుల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగినట్లు దీని ద్వారా గుర్తించారు. అత్యల్పంగా ఏర్గట్ల పరిధిలో జరిగాయి. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, గాంధీచౌక్ ప్రాంతాల్లో జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు.

● జాతీయ రహదారిపై సూచికలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జాతీయ రహదారులపై ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్ రహదారిపై, రాష్ట్ర రహదారులపై సూచికలను ఏర్పాటు చేశారు. ఈ సూచికల ద్వారా వాహనదారులు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించుకునే అవకాశాలు ఉన్నాయి. కొన్ని చోట్ల వేగనిరోధక సంకేతాలతో పాటు స్పీడ్‌గన్‌లను ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు.

● ఐరాడ్ పనితీరును విస్తరించాలి (సుప్రీంకోర్టు)

రోడ్డు ప్రమాదాల నివారణలో ఐరాడ్ విధానం పనితీరును, సేవలను సుప్రీంకోర్టు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించడంతో ఎలక్ట్రానిక్ డిటైల్ యాక్సిడెంట్ రిపోర్ట్(ఈ-డార్)గా అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సమన్వయమైన శాఖలతో పాటు మోటర్ యాక్సిడెంట్ క్లైమ్ ట్రిబ్యునల్, లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఇన్సూరెన్స్ కంపెనీలను జతపర్చనుంది. తద్వారా బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం చేయనున్నారు.

అవగాహన లోపంతోనే రోడ్డు ప్రమాదాలు

ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అవగాహన లేకపోవడంతోనే జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు వివిధ ప్రాంతాల్లో రోడ్డు భద్రతా వారోత్సావాలు, సదస్సులు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నాము. రాబోయే రోజుల్లో 30శాతం ప్రమాదాలు తగ్గుముఖం పట్టేలా వివిధ శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నాము. అదే విధంగా పోలీసు అధికారుల సహకారంతో ఈ సంవత్సరం దాదాపు 400లకు పైగా ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.ముఖ్యంగా సాయంత్రం6గం టల నుంచి 7గంటల సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్డుల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. శని,ఆదివారాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాము.

-వర్షని హాంత్, ఐరాడ్ మేనేజర్

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

● బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్


రాష్ట్రస్థాయి బాల్‌బ్యాట్‌మెంటన్ టోర్నీ విజేత జట్లకు ట్రోఫీని అందజేస్తున్న ముత్యాల సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి,జనవరి28:క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు గెలపుకోసం ప్రయత్నం చేయాలని క్రీడాకారులు గెలుపు ఓటములను సమానస్థాయిలో స్వీకరించాలని బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని కేబీఏ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు కొనసాగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవంలో బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్లకు బహుమతి ప్రదానం చేశారు. శనివారం అర్ధరాత్రి ఒంటిగంటవరకు ఉత్కంఠ భరితంగా సాగిన బాల్‌బాడ్మింటన్ డబుల్స్, సింగిల్స్ ఫైనల్ క్రీడలను ఆయన తిలకించారు. ఫైనల్ మ్యాచ్ తిలకించడాకివచ్చిన క్రీడాభిమానులతో ఇండోర్ స్టేడియం క్రిక్కిరిసిపోయింది.ఈపోటీల్లో ఓపెన్ డబుల్స్‌లో నిజామాబాద్‌కు చెందిన అర్షద్, రాఘవ ప్రథమ, కేబీఏ కమ్మర్‌పల్లికి చెందిన పెంట కిషన్, మోహన్‌రెడ్డి ద్వితీయ, భైంసాకు చెందిన నవీన్, విష్ణు తృతీయ స్థానంలో నిలువగా 40ప్లస్ డబుల్స్ విభాగంలో కేబీఏ కమ్మర్‌పల్లికి చెందిన పెంట కిషన్ మోహన్‌రెడ్డి ప్రథమ, హైదరాబాద్‌కు చెందిన నవీన్ సాయి ద్వితీయ, ముప్కాల్‌కు చెందిన నవీన్ ,దినేష్ తృతీయ స్థానల్లో నిలువగా విజేత జట్లకు ట్రోఫీని నగదు బహుమతి ముఖ్యఅతిథి సునీల్ కుమార్ అందజేశారు.సమర్థవంతంగా రాష్ట్రస్థాయి క్రీడల్ని నిర్వహించిన కమ్మర్‌పల్లి బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ (కేబీఏ) నిర్వహకులను అభినందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట్ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు పాష, స్థానిక నాయకులు పాలెపు నర్సయ్య, కేబీఏ అధ్యక్షుడు ఎండి అహ్మద్, సలహాదారుడు లుక్క గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సీఐగా మల్లేశ్ బాధ్యతలు స్వీకరణ


మల్లేశ్ ఎస్ఐ

డిచ్‌పల్లి,జనవరి 28:డిచ్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గా కే.మల్లేశ్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటానని శాంతి భద్ర తల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరా రు. సమస్యలు ఉంటే నేరుగా తన కార్యాలయానికి రావొచ్చని పేర్కొ న్నారు.

శిక్షణ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి28: ఆర్మూర్ పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు వినియోగించుకొని భవిష్యత్‌లో ఉపాధి పొందాలని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సేవలు ఆదర్శమని కొనియాడారు. విద్య, వైద్యరంగానికి సేవలందించడం అభినందనీయమన్నారు. గ్లోబల్ నిధుల నుంచి రూ.25లక్షలు మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కుర్చీలు, టేబుళ్లు వితరణ చేశారు. అంతకు ముందు సిద్దుల గుట్టను సందర్శిం చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షు డు పుష్కర్ రావు, విజయసారథి, రాజ్‌కుమార్ అగర్వాల్, మోత్కురి లింగాగౌడ్, గంగామోహన్‌చక్రు, ఎలెక్ట్ అధ్యక్షుడు రజనీష్‌కిరడ్, కాంతి గంగారెడ్డి, ఎంకె.నరేందర్, లింబాద్రిగౌడ్, రాస ఆనంద్, గోనే దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకాలనీలో స్వచ్ఛ భారత్

ఆర్మూర్‌టౌన్ జనవరి28: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటల పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఆదివారం రెండు గంటల పాటు శ్రమదానం నిర్వహించారు. కాలనీలోని రోడ్డు పొడవున పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. రోడ్డుపై డ్రైనేజీ నీరు పారడంతో జేసీబీ సహాయంతో రెండు పైపులను బిగించి రోడ్డును చదును చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొసికొండ అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, సుంకె శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, కొంతం రాజు, ఎల్‌టి.కుమార్, ఎర్రభూమయ్య, గణేష్, మురళీ, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ముప్కాల్, జనవరి28: ముప్కాల్ మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో అండర్-17 బాలుర, బాలికల 30వ తేదీన ఒక రోజు జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దయానంద్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని పదవ తరగతి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారు. ఉదయం 10గంటల లోపు క్రీడా మైదానంలో హాజరుకావాలని తెలిపారు. దాత దయానంద్‌రెడ్డి గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో వందకు పైగా పాఠశాలలో రూ.10కోట్ల విలువైన మౌళిక వసతులు కల్పించారని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా దుస్తువులు, క్రీడా పరికరాలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటుకు రూ.లక్ష అందించడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు.

మెంట్రాజ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి, జనవరి 28:ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్టు నీడలో చదువుకొని పలువురు వివిధ హోదాల్లో, వ్యాపారాల్లో పలు విభిన్నమైన ప్రాంతాల్లో ఉంటూ 28ఏళ్ల తర్వాత ఒకే చోటుకు చేరారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1995-96 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పుడు బోధించిన గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారి ఆత్మీయ పలకరింపులు, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులంత ఒకే చోట చేరి సహపంక్తి భోజనాలు చేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నయ్య, లక్ష్మీనారాయణ, విక్రముల్ల, మోహన్, కొసరాజు రామకృష్ణ, నర్సింహమూర్తి, రాజేశ్వర్, వెంకటయ్యలకు విద్యార్థులు శాలువలు, మెమెంటోలతో ఘనంగా సన్మా నించారు. ఆరోజుల్లో చదువు చెప్పిన గురువులు కొందరు మరణించడంతో వారికి ప్రత్యేకంగా నివాళ్లు అర్పించారు.


మెంట్రాజ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహాలక్ష్మి ఆలయంలో రూరల్‌ఎమ్మెల్యే పూజలు

నిజామాబాద్ రూరల్, జనవరి 28: రూరల్ మండలం జలాల్‌పూర్ గ్రామంలోని మహాలక్ష్మి అలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి స్వగ్రామమైన జలాల్‌పూర్‌కు ఆదివారం ఆయన కుటుంబసమేతంగా వచ్చారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. గ్రామంలోని సమ్యలను గ్రామమస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. కొన్నేళ్లుగా జలాల్‌పూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, దాంతో గ్రామానికి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నవీపేట్ నుంచి నిజామాబాద్ వెళ్లే బస్సు రోజుకు కనీసం రెండు ట్రిప్పులు వేయించాలని కోరడంతో వెంటనే ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జాన్‌రెడ్డికి ఫోన్‌చేశారు. దాంతో సోమవారం నవీపేట్ నుంచి జలాల్‌పూర్‌కు రెండు ట్రిప్పులు బస్సులు మంజూరుచేశారు. గ్రామంలోని మహాలక్ష్మి అలయం చుట్టూ కాంపౌండ్ వాల్, వంటచేసుకోవడానికి కిచెన్ షెడ్ నిర్మాణానికి నిదులు మంజూరు చేయమని కోరారు. త్వరలోనే ఎస్టిమేషన్ వేసి సరిపడా నిదులు కేటాయిస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి గ్రామస్థులకు హామీ ఇచ్చారు.


మహాలక్ష్మి మందిరంలో మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

క్రీడాకారులకు నగదు పురస్కారం

మోర్తాడ్, జనవరి28: మండలంలోని సుంకెట్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విన్నర్‌గా అంబేద్కర్ యూత్, రన్నర్‌గా పాఠశాల జట్టు గెలుపొందారు. కబడ్డీ పోటీలో సెలబ్రేషన్ టీం గెలుపొందగా, ఆల్‌రౌండర్ జట్టు రన్నర్‌గా నిలిచారు. గెలుపొందిన ఇరు జట్లకు వీడీసీ అధ్యక్షుడు ప్రసాద్, శ్రీనివాస్ రూ.10 వేల నగదును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు రూ.12వేల మైక్ సెట్‌ను వీడీసీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మచ్చర్లలో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, జనవరి28: ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ నిర్మాణానికి ఎంపీపీ పస్కనర్సయ్య భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చైతన్యానికి, ఐకమత్యానికి ఛత్రపతి శివాజీ నిదర్శనమని అన్నారు. నేటి యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ గంజి నర్సయ్య, ఉపసర్పంచ్ గంగారెడ్డి, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

బోధన్ రూరల్, జనవరి 28: బోధన్ మండలం పెంటాఖుర్దు క్యాంపు శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,800 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా పేకాట నిర్వహించిన, పేకాట ఆడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బా విద్యార్థులు

మెండోర, జనవరి28: జాతీయస్థాయి కరాటే పోటీలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బా విద్యార్థులు నిలిచారని కస్తూర్బాగాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలో మొదటి స్థానంలో ఐదుగురు విద్యార్థులు రెండో స్థానంలో ముగ్గురు విద్యార్థులు, మూడో స్థానంలో నలుగురు విద్యార్థులు నిలిచారు. మొదటి స్థానంలో ఇద్దరు విద్యార్థులు నిలిచారు. ఫైట్‌లో మొదటిస్థానంలో ఇద్దరు విద్యార్థులు, రెండో స్థానంలో ముగ్గురు విద్యార్థులు, మూడో స్థానంలో తొమ్మిది మంది విద్యార్థులు నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకున్నారని తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్ ట్రోపీ అందుకున్న విద్యార్థు లకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ, ఉపాధ్యాయ బృందం సునీల్, కల్పన, లలిత, ఉమా తదితరులు అభినందించారు.

సీఎం, కోదండరాం చిత్రపటాలకు క్షీరాభిషేకం

రుద్రూరు. జనవరి 28 : రుద్రూరులో తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు రాజా వరప్రసాద్, డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, నాగనాథ్,మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీకౌన్సిలర్‌కు పరామర్శ

ఆర్మూర్‌టౌన్,జనవరి28: పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో రాష్ట్ర మార్క్‌ఫెడ్‌చైర్మన్ మార గంగారెడ్డి ఆదివారం మాజీకౌన్సిలర్ సడాక్ వినోద్‌ను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో పడాక్ వినోద్ మాతృమూర్తి మృతి చెందడంతో పరామర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఆయన వెంట డాన్‌మహేష్, నారాయణ, సడాక్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు రిపోర్టులు సృష్టించిన అధికారులను సస్పెండ్ చేయాలి'


ఆర్మూర్‌లో రిలే నిరహార దీక్ష చేస్తున్న మైనారిటీ కౌన్సిలర్‌లు

ఆర్మూర్‌టౌన్, జనవరి28: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపైఅవిశ్వాసం తీర్మానం నెగ్గిన తర్వాత తప్పుడు రిపోర్టులు సృష్టించిన అధికారులను సస్పెండ్ చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, మైనారిటీ కౌన్సిలర్‌లు ఇంతియాజ్‌హుస్సెన్, అబ్దుల్ రహమాన్, అతిక్, జహీర్, ఫయాజ్‌లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలో వారు మాట్లాడుతూ ఈనెల 4న అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ తెలిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారని, 25రోజులు గడుస్తున్న వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జీ చైర్మన్‌గా ఇవ్వడంలేదని మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబసభ్యులు నిబంధనలను కాలరాయడానికి అధికార పార్టీ కాంగ్రెస్ నాయకుల వంతనచేరి కుటిల రాజకీయాలు చేస్తున్నారని అవినీతి పరులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపడం సరికాదని, ముస్లీం మైనారిటీలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నశించాలని అన్నారు. అలాగే అవినీతిపరులతో కుమ్మక్కై తప్పుడు రిపోర్టులు సృష్టిస్తున్న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈధర్నాలో ముస్లిం మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఘర్షణ ఒకరిపై కేసు నమోదు

బోధన్ రూరల్, జనవరి 28: సాలూర మండల కేంద్రంలో మహిళల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. మహిళా టైలరింగ్ విషయంలో మహిళల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈసందర్భంగా అనిత అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



బీర్కూర్‌లో కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పండరీపూర్ పాదయాత్రకు తరలిరండి

బీర్కూర్, జనవరి 28 : బీర్కూర్ మండలం బైరాపూర్ రుక్మిణి విఠలేశ్వర ఆలయం నుంచి ప్రతీ యేటా వేలాది మంది భక్తులు మహా పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌కు పాదయాత్రగా తరలివెళతారు. ఈ ఏట కూడా ఫిబ్రవరి 5న తరలివెళుతున్నారు. ఈ మేరకు ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో పండరీపూర్ పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను అధ్యక్షుడు పీరాజీ మహరాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5న బైరాపూర్ విఠలేశ్వర ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుందని, ఫిబ్రవరి 21న పండరీపూర్‌కు చేరుకుంటుందన్నారు. పాదయాత్రకు రావాలనుకునే భక్తులు ఫిబ్రవరి 5న బైరాపూర్ ఆలయానికి రావాలని అన్నారు. పాదయాత్రలో భాగంగా ప్రతీరోజు మధ్యాహ్నం, రాత్రివేళలో ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



శెట్పల్లి సంగారెడ్డిలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లింగంపేట, జనవరి 28 : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలలో 1992-93లో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషాలను పంచుకున్నారు. ఇప్పుడు వారు ఏ స్థాయిలో ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయం, వ్యవసాయం, గృహిణిగా వారు అందిస్తున్న సేవల గురించి, ఒకరితో ఒకరు పంచుకున్నారు. వారంతా కలిసి గ్రామానికి ఏదైనా సేవా కార్యక్రమాన్ని చేయాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో మోహన్, నారాయణ, అంజనేయులు, సాయన్న, ఆనంద్, విద్యతో పాటు 50మంది విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు.

రామారెడ్డి: మండలంలో గిద్ద గ్రామంలో విజేత యూత్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ వెంకట రమణ, నేతలు రవి, గణేష్, భరత్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి ఇంద్రప్రస్థలో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1999-2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఎక్కడెక్కడో స్థిరపడిన తామంతా ఒక్కచోటుకు చేరి ఇలా కలుకోవడం ఆనందంగా ఉందని, ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం పాతజ్ఞాపకాలను నేమరువేసుకుంటూ సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: మండలంలోని ఉత్తనూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ వాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువతో ఘనంగా సన్మానించారు. 50 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరడంతో సందడి నెలకొంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



దుర్గయ్య(ఫైల్)

దోమకొండ, జనవరి 28: మండలంలోని ముత్యంపేట గ్రామంలో బొబ్బిలి దుర్గయ్య(53) అనే రైతు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేట గ్రామానికి చెందిన దుర్గయ్య తనకు ఉన్న మూడెకరాల పొలంలో వరి పంటను పండిస్తూ జీవనం గడుపుతున్నాడు. సాగు నీటి కోసం ఇటీవల మూడు బోర్లను వేయగా ఒక్క చుక్క నీరు పడకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో బోర్ల కోసం చేసిన అప్పులు, ఇతర అవసరాలకు చేసిన అప్పులు సుమారు రూ. 4లక్షల వరకు అయ్యాయి. అప్పులు అధికమవ్వడంతో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య బొబ్బిలి శోభ, కూతురు పూజ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సదాశివనగర్, జనవరి 28: నియోజకవర్గంలోని ప్రతీ పేద కుటుంబానికి కూడు గూడు విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని మర్కల్ గ్రామంలో సీసీరోడ్లు ప్రారంభించి మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించిన విజయమే నాకు బలంగా మారిందని దీంతో అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను లేవనెత్తి అభివృద్ధి కోసం నిధుల వేట మొదలు పెడుతున్నానని అన్నారు. ప్రతి ఒక్కరూ మధ్యవర్తులను ఎంచుకోకుండా సమస్యల పరిష్కారానికి విన్నవించుకోవాలని తెలిపారు. ఒకేరోజు 176 సీఎం సహాయనిధి దరఖాస్తులను మంజూరు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని అన్నారు. గిరిజన సంక్షేమం కోసం 8 కోట్ల 50లక్షలు మంజూరు చేయిస్తున్నానన్నారు. నాలుగు కోట్ల 50 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మురుగు కాలువలు అక్కడక్కడ అత్యవసరమున్నచోట చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో చర్చించుకుని ప్రధాన సమస్యలను ముందు ఉంచుకుంటే ఓపికగా తీర్చుకుందామని తెలిపారు. ప్రభుత్వం అందించిన ఆరు పథకాలలో ఇప్పటికే రెండు పథకాలను అమలు చేయడం జరుగుతుందని మిగిలిన పథకాల్లో కొద్దిరోజుల్లోనే అమలు జరుగుతుందన్నారు. అప్పులపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే ప్రభుత్వానికి కొంత సమయం పడుతుందని అన్నింటిని సరి చేసుకుంటూ నిధుల ఏర్పాటు చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగారెడ్డి, తహసీల్దార్ హిమబిందు, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, సింగిల్‌విండో చైర్మన్ గంగాధర్, విండో డైరెక్టర్ రామ్‌రెడ్డి, లింగాగౌడ్, భాగయ్య, సంపత్‌గౌడ్, సాయిరెడ్డి, శంకర్, ధర్మారావుపేట్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలందుకుంటున్న మైసమ్మ

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జనవరి 28 : మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

అద్దె భవనాల్లో అధికారుల ఇక్కట్లు



నసురుల్లాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న సమీకృత భవనం

● మండల అధికారులకు తప్పని తిప్పలు

నసురుల్లాబాద్, జనవరి 28: మండల కేంద్రంలో కోటి రూపాయలతో నిర్మించిన సమీకృత భవనం పూర్తికాకపోవడంతో అధికారులు అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో శాశ్వత భవనం లేక అధికారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాలు ఎక్కడున్నాయో తెలియక ప్రజలు సైతం మండల కేంద్రం మొత్తం తిరగాల్సి వస్తుంది. అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రారంభ మవుతున్న చివరి రోజున గత శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హుటాహుటిన భవనాన్ని ప్రారంభించి కేవలం అతిత్వరలో ఈ భవనం పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. కానీ ఆయన మాటలను గుత్తేదారులు పెడచెవిన పెట్టి భవన నిర్మాణాన్ని ఆలస్యం చేశారు. దీంతో ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కావడంతో ప్రభుత్వం మారిపోయింది. గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత భవనంలో అధికారులు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వైకుంఠ రథాన్ని అందిస్తున్న రాజేశ్వర్‌రావు

వైకుంఠ రథం విరాళం

తాడ్వాయి, జనవరి 28: మండలం కరడ్‌పల్లి గ్రామంలో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తండ్రి రాజేశ్వర్‌రావు గ్రామానికి వైకుంఠరథం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మృతిచెందిన వారికి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో వైకుంఠరథం విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బాలచంద్రం, నాయకులు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గాంధారి, జనవరి 28: గాంధారి మండలంకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ తాడ్వాయి సంతోష్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆయన కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచారెడ్డి, జనవరి 28: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించడానికి ఉదయం నుంచి బారులు తీరారు. కుంకుమార్చన, అభిషేకాలు, హారతులు వంటి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారికి వెండితో చేసిన కల్లు, కోర మీసం, ముక్కు పట్టెనామాలు వంటివి సమర్పించుకున్నారు. ఒడి బియ్యం వంటి కార్యక్రమాలను చేపట్టారు. సంతానం లేని మహిళలు ప్రాంగణంలో గల అల్లుబండ వట్టి పూజలు చేశారు.

హమాలీలకు భద్రత కల్పించాలి

బోధన్ రూరల్, జనవరి 28: హమాలీలకు ప్రభుత్వం భరోసా, భద్రత కల్పించాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హమాలీలకు భరోసా, భద్రత కల్పించడంలో సవితి ప్రేమ చూపిందన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, హమాలీలకు భరోసా, భద్రత కల్పించాలని కోరారు.



విజేతలకు కప్‌ను అందిస్తున్న ప్రతినిధులు

ముగిసిన క్రికెట్ టోర్నీ

కామారెడ్డి రూరల్, జనవరి 28: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మాజీ సర్పంచ్ శివాజీగణేష్ స్మారకంగా ఈనెల 26 న ప్రారంభించిన క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. మూడురోజుల పాటు పలుజట్లు పోటీపడగా దేవునిపల్లి స్టార్స్ టీమ్ విజయం సాధించడంతో నాయకులు లద్దురి లక్ష్మీపతి, నాగార్జున, రామ్‌కుమార్‌లు విజేతలకు కప్‌తో పాటు రూ.10 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవునిపల్లి అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసి గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే కామారెడ్డి పట్టణంలోని వార్డులకు ఏ మాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసిన మహా నాయకుడు శివాజీ గణేష్ అని అన్నారు. అలాంటి వ్యక్తిని స్మరించుకుంటూ క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆయన స్ఫూర్తితో యువకులు ప్రజాసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, కౌన్సిలర్‌లు కృష్ణాజీరావు, నాయకులు నీలం చిన్నరాజులు, కాసర్ల స్వామి, కాసర్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ విద్యా మహాసభలను

జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 28: ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ కోరారు. 1944 నుంచి ఫెడరేషన్ విద్యావ్యాప్తికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. విద్యాసంబంధ కార్యక్రమాలపై అనేక చర్చలు, తీర్మానాలు ఈ సమావేశాల్లో చేయడం జరుగుతోందని జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సభలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

తాడ్వాయి, జనవరి 28: మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన చాకలి రాజశేఖర్ కుటుంబసభ్యులకు ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.5లక్షల ఎల్‌ఓసీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుడు రాజశేఖర్ విదేశాలకు వెళ్లి తీవ్ర అనారోగ్యానికి గురై స్వదేశం తిరిగి వచ్చారని తెలిపారు. ఆయన చావు బతుకుల్లో ఉన్న సమయంలో తనకు సమాచారం అందించారని వెంటనే స్పందించిన బాధితుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించడం కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేమెకమ్మరి రాజు, మెట్టుచిన్నసాయిలు, లింగారెడ్డి, రషీద్ పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్టు

మద్నూర్, జనవరి 28: తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు ప్రసూన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ టెస్టుకు అర్హులన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముగ్గురు చొప్పున విద్యార్థులను పంపించాలని ఆయన సూచించారు. ఎంపికైనవిద్యార్థులకు ఫిబ్రవరి 10న జరిగే రాష్ట్రస్థాయిలో జరిగే సోషల్ టాలెంట్‌కు అర్హత సాధిస్తార న్నారు. అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసు కోవాలన్నారు.

దివ్యాంగుడికి ఇంటిని నిర్మించిన మాజీ ఎమ్మెల్యే



షేక్ ఖాదర్ నూతన ఇంటి ఎదుట మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డిటౌన్, జనవరి 28: మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ తన సొంతడబ్బులు రూ.10లక్షలతో పాత రాజంపేటకు చెందిన దివ్యాంగుడైన షేక్‌ఖాదర్‌కు కొత్త ఇల్లు నిర్మించి ఆదివారం అందించాడు. ఈ సందర్భంగా షేక్‌ఖాదర్ మాట్లాడుతూ రైల్వేగేట్ దగ్గర రోడ్డు పక్కన పురిగుడిసెలో ఉంటూ వర్షం పడినప్పుడల్లా నానా అవస్థలు పడేవాడనని తెలిపారు. నా బాధలు చూసి ఎమ్మెల్యే తనసొంత డబ్బులతో ఇంటి నిర్మాణం చేసి ఇచ్చాడని ఆయన రుణం ఎప్పటికి తీర్చుకోలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్, ఎంపీపీ పిప్పిరి అంజనేయులు, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పిప్పిరి వెంకట్, వైస్‌చైర్మన్ కుంబాల రవి పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, జనవరి 28: కామారెడ్డి పట్టణ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం మహేష్, ఉపాధ్యక్షులుగా పోతుల భాస్కర్, మౌరపు సంజీవ్, దువ్వాల చంద్రశేఖర్‌లను, సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా పాతఅంజయ్య, సలహదారులుగా గోనె శ్రీనివాస్, డైనమిక్ రమేష్, చింతల రమేష్, కృపాల్, శ్రీధర్, పిట్ల శంకర్, కార్యవర్గసభ్యులుగా ఒడ్డెం కిషన్, సాయిరెడ్డి, తోట రాజు, కడెం శ్రీకాంత్, రమణ, పిల్లి రమేష్, శ్రీనివాస్, రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

రాజంపేట, జనవరి 28: మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన కట్లెరాజు కొద్దిరోజుల క్రితం చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతని స్నేహితులు రూ.15వేలను ఆర్థిక సహాయంగా రాజు కుటుంబసభ్యులకు అందించారు. పాఠశాలలో తమతో చదివి అందరితో కలివిడిగా ఉండే రాజు తనువుచాలించడం బాధాకరంగా ఉందని అతని కుటుంబానికి తాము అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, విజయ్, రాజు, నరేష్, శ్రీకాంత్, ప్రవీణ్, విజయ్, షోషయ్య, రవి, అశోక్, చలెస్, పరశురాములు పాల్గొన్నారు.

'జైపాల్‌రెడ్డి గాంధారికి వస్తే అడ్డుకుంటాం'



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా

గాంధారి, జనవరి 28: బీజేపీ రాష్ట్ర శాఖ జైపాల్‌రెడ్డిని జహీరాబాద్ బీజేపీ ఎంపీ టికెట్ రేసులోంచి తొలగించాలని గాంధారి మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ బీజేపీ సిద్ధాంతాలు, వ్యవహారాలు పక్కన పెట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వారితో బీజేపీ కార్యకర్తల మధ్య గొడవలు పెడుతూ రాక్షసానందం పొందుతున్నాడని అన్నారు. ఎన్నికలు అయిపోయిన తెల్లారి నుంచి మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు పార్టీని కాపాడే కార్యకర్తలను పక్కనపెట్టి కేవలం ఎన్నికల కోసమే పని చేయించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. రాష్ట్ర శాఖ ఈ విషయాలపై దృష్టి సారించి పార్టీ కోసం పని చేసే వారికే టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మాణిక్‌రావు, ప్రభాకర్‌రావు, రమేష్, సతీష్, వాసు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	క్యాప్టెన్ మిల్లర్
ప్రియా 35	అయాలన్

బాన్సువాడ

మహేశ్వరి	సైంధవ్
వెంకటేశ్వర	నా సామిరంగ

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210